సాక్షి రంగారెడ్డి

బుధవారం । 2 । ఆగస్టు । 2023



సబ్సి'డీలా'!

రాయితీలపై యంత్రాలు, పరికరాలు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేద ని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



'లయన్స్'కు అవార్డుల పంట

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ద్వారా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు ఈసారి అవార్డుల పంట పండింది. 8లో▸



టైరు పేలి.. కారు బోల్తా

కారు టైర్ పేలి, డివైడర్‌ను ఢీ కొట్టిన సంఘ టన తుర్కయంజాల్‌లో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. 8లో▸

జల సవ్వడి



కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పెద్దఅంబర్‌పేటలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న చెక్‌డ్యాం (పెద్దకత్వ) జలకళను సంతరించుకుంది. పై నుంచి కిందకు జాలువారే జలపాతం కనువిందు చేస్తోంది. – అబ్దుల్లాపూర్‌మెట్



'సీత్లా' సందడి

ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని చంద్రాయణపల్లితండాలో మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. గిరిజన మహిళలు నైవేద్యంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండాలని, పాడిపశువులు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఊరేగింపులో యువతీయువకుల నృత్యాలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ కృష్ణనాయక్, ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసద్‌రెడ్డి, తండా నాయకులు పాల్గొన్నారు. – ఆమనగల్లు



చంద్రాయణపల్లితండాలో గిరిజనుల నృత్యం

న్యూస్‌రీల్

నూతన నియామకం



ప్రదీప్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ జాతీయ ప్రోగ్రాం సమన్వయకర్తగా పట్టణానికి చెందిన కళాకారుడు, అజయ్ నటరాజ కళానిలయం వ్యవస్థాపకుడు మానపాటి ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ రాజ్‌కుమార్ మంగళవారం ప్రకటించారు. కళా సేవలో, సామాజిక సేవలో తనవంతు పాత్ర పోషిస్తున్న ప్రదీప్‌కుమార్ తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థ నుంచి మహానంది పురస్కారాన్ని సైతం అందుకున్నారు.

మైసిగండి హుండీ ఆదాయం రూ.11.02 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కడ్తాల్: మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ రామాలయా దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ సమక్షంలో దేవాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం 54 రోజులకు గాను భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా.. రూ.11,02,182 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ముఖ్య అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఠాణా భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయండి



భవన నిర్మాణ పనులను పరిశీలించిన డీసీపీ నారాయణరెడ్డి తదితరులు

కడ్తాల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని శంషాబాద్ డీసీపీ కె.నారాయణరెడ్డి నిర్మాణదారులకు సూచించారు. అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రంగస్వామితో కలిసి మంగళవారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

జలమండలికి మరో పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలికి పురస్కారాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే మూడు అవార్డులు దక్కగా తాజాగా మరొకటి తన ఖాతాలో వేసుకుంది. ది ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఫౌండేషన్ (ఈఈఎఫ్) వారి 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ అవార్డు – 2023'ను దక్కించుకుంది. ఈ మేరకు ఎండీ దానకిశోర్‌కు ఈఈఎఫ్ ఫౌండేషన్ సీఈఓ డా.అనిల్ గార్గ్ ఓ లేఖ రాశారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణలో జలమండలి ఎప్పటికప్పుడు నూతన సాంకేతికత విధానాలు రూపొందించుకోవడంతో పాటు ఐటీ, రెవెన్యూ పరంగా సైతం అధునాతన టెక్నాలజీని జోడిస్తూ అమలు చేస్తోంది. అవార్డును ఈ నెల 25న దేశ రాజధాని ఢిల్లీలోని డా.బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో అందజేయనున్నారు. ఈ ఏడాది జలమండలి 3 అవార్డులు గెలుచుకుంది.

బీమా.. ఏదీ ధీమా?

అతివృష్టి, అనావృష్టితో పంటలకు తీవ్ర నష్టం

- నాలుగేళ్లుగా పంటల బీమాపై స్పష్టత కరువు
- రైతులకు దక్కని పరిహారం



షాబాద్ మండలం మీరాపూర్‌లో ఇటీవల కురిసిన వర్షానికి నీటమునిగిన పంట

షాబాద్: కష్టాన్నే నమ్ముకుని ముందుకు 'సాగు'తున్న రైతన్నకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. అతివృష్టి, అనావృష్టితో ఏటా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నా బీమా అందడం లేదు. చెల్లింపుపై ప్రభుత్వం నాలుగేళ్లుగా స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు 4.10 లక్షల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, వరి, కంది, పెసర, మినుము, పూలు తదితర పంటలు సాగుచేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో పాటు పంటకు తెగుళ్లు ఆశించి దెబ్బతింటున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను పంటల బీమా పథకం ఆదుకునేది. ప్రస్తుతం ఆ ధీమా లేకుండా పోయింది. గతంలో ప్రభుత్వం వానాకాలం, యాసంగి సీజన్ ప్రారంభమైన వెంటనే రైతుల నుంచి బీమా డబ్బులు తీసుకునేది. బ్యాంకర్లు తమ వద్ద పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి ముందుగానే బీమా డబ్బును జమ చేసుకునేవారు. ఎకరానికి పత్తికి రూ.1,700, వరికి రూ.1,200, ఇతర అన్నిరకాల పంటలకు రూ.300 నుంచి రూ. 500 వరకు ప్రీమియం వసూలు చేసేవారు. బీమా చేసుకున్న తర్వాత ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే బీమా కంపెనీలు పంటనష్టంలో 80 శాతం డబ్బును రైతులకు పరిహారంగా చెల్లించేవి. నాలుగేళ్లుగా బీమా సొమ్ము తీసుకోకపోవడంతో అన్నదాతలు నిరాశలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం సైతం అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందే అవకాశాలు కనిపించడం లేదు.

తీవ్రంగా నష్టపోతున్నాం



అతివృష్టి, అనావృష్టితో పాటు పంటలకు తెగుళ్ల ఆశించి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పండించిన పంటకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం పంటల బీమా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలి.
– క్యామ నారాయణ, రైతు, కుమ్మరిగూడ

ఆదేశాలు రాలేదు



పంటల బీమా పథకంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఈ ఏడాది అమలు చేయలేదు. ఉత్తర్వులు అందితే బీమా సొమ్ము తీసుకుంటాం.
– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

ఓటేయడం అందరి బాధ్యత

- ఈఆర్‌ఓలు, బూత్‌స్థాయి సూపర్‌వైజర్ల వర్క్‌షాప్‌లో సీఈఓ వికాస్‌రాజ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్ సేవాలాల్ భవనంలో జాయింట్ సీఈఓ లోకేష్‌కుమార్, అదనపు సీఈఓ సర్ఫరాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, సంగారెడ్డి కలెక్టర్ శరత్, మేడ్చల్ కలెక్టర్ అమయ్‌కుమార్, రంగారెడ్డి కలెక్టర్ హరీశ్‌తో కలిసి స్వీప్ ఆక్టివిటీస్‌పై ఈఆర్ఓలు, బూత్ స్థాయి సూపర్ వైజర్లకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు పాత్ర ఎంతో కీలకమైనందున అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని, త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారంతా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి సూపర్ వైజర్లు, నోడల్ అధికారులు రెసిడెన్షియల్ అసోసియేషన్ వెల్ఫేర్ వారితో సంప్రదించి అపార్ట్ మెంట్‌లలో ఉండే వారిని ఓటు నమోదు, మార్పులు చేర్పులు చేసే విధంగా ఫామ్ 6,7,8 లను సేకరించాలని సూచించారు. ఎన్నికల్లో వంద శాతం ఓటు వేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం



సభలో మాట్లాడుతున్న హనుమంతరావు

- పార్టీ సీనియర్ నేత హనుమంతరావు

బడంగ్‌పేట్: మొదటినుంచి బీసీలకు న్యాయం చేస్తున్నది కాంగ్రెస్సే అని ఆ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. బాలాపూర్ మండలంలోని మల్లాపూర్ ఏవైఆర్ గార్డెన్‌లో మంగళవారం పూర్వపు రంగారెడ్డి జిల్లా బీసీల ఐక్యవేదిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు సంఘటిత శక్తిగా కొనసాగాలన్నారు. ప్రతి పార్లమెంట్ పరిధిలో మూడు అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించాలన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. నాడు పోరాటం చేస్తే స్వాతంత్ర్యం వచ్చిందని.. నేడు మరో పోరాటం చేసి బీసీల రాజకీయ హక్కులు తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. 56 శాతం ఉన్న బీసీలు ఏకమైతే మరో పార్టీ ఉద్భవిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు రమేష్ ముదిరాజ్, జగదీశ్, జంగయ్య యాదవ్, జనరల్ సెక్రటరీ జైపాల్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జితేందర్, స్పోక్ పర్సన్ గౌరి సతీశ్, పీసీసీ సెక్రటరీ ఎల్మెటి అమరేందర్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత, ఏనుగు జంగారెడ్డి, నందికంటి శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



చందానగర్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

మొయినాబాద్: ఉపాధ్యాయుల బదిలీలతోపాటు పదోన్నతులు వెంటనే కల్పించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చిలుకూరు, చందానగర్, రెడ్డిపల్లి, మేడిపల్లి, వెంకటాపూర్, పెద్దమంగళారం తదితర పాఠశాలల్లో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేసి మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పీఈటీ, పండిట్ పోస్టులు అప్‌గ్రేడేషన్ చేయాలని, 317 జీవో ద్వారా ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరేందర్, వేణుగోపాల్, ఇతర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్‌ను దాటేలా మెట్రో

ఇప్పటికే నిర్మితమైన మార్గంతో కలుపుకొని 415 కి.మీ

- మొత్తం 186 మెట్రో స్టేషన్లు
- ఫేజ్–3 పార్ట్ ఏలో రెండు మార్గాల్లో డబుల్ ఎలివేటెడ్ ఫ్లైఓవర్లు
- ఔటర్ చుట్టూ ఏడు ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్లు
- ఫేజ్–3లో 278 కి.మీ.. రూ.60 వేల కోట్ల అంచనా
- బీహెచ్‌ఈఎల్- లక్డీకాపూల్, నాగోల్–ఎల్బీనగర్ మార్గాలకు మరో 9,100 కోట్లు
- వివరాలు వెల్లడించిన మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సనత్‌నగర్: ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచే దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మెట్రోరైల్ మార్గాలను మరింతగా విస్తరిస్తున్నట్లు మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బేగంపేటలోని మెట్రో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఫేజ్–2లో చేపట్టే బీహెచ్‌ఈఎల్–లక్డీకాపూల్, నాగోల్–ఎల్బీనగర్ మార్గాలతో పాటు ఫేజ్–3లో 278 కిలోమీటర్ల మేర చేపట్టే మెట్రో రైల్ నిర్మాణానికి రూ.69,100 కోట్ల అంచనా వ్యయాన్ని రూపొందించినట్లు ఆయన చెప్పారు.

ఫేజ్–3 పార్ట్–ఏలో రెండుచోట్ల డబుల్ ఎలివేటెడ్ ఫ్లైఓవర్లు

ఫేజ్–3 పార్ట్–ఏలో భాగంగా జూబ్లీ బస్టాండ్ నుంచి తూముకుంట వరకు సాగే మార్గం, ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి మేడ్చల్ హైవేలోని కండ్లకోయ వరకు సాగే మెట్రో మార్గాల్లో డబుల్ ఎలివేటెడ్ ఫ్లైఓవర్లు రానున్నాయి. ఈ ఫేజ్‌లోనే బీహెచ్‌ఈఎల్–పటాన్‌చెరు–ఓఆర్‌ఆర్ దాటుకుని ఇస్నాపూర్ వరకు, ఎల్బీనగర్ నుంచి పెద్ద అంబర్‌పేట వరకు, శంషాబాద్ ఎస్‌హెచ్ మెట్రో–కొత్తూరు–షాద్‌నగర్ వరకు, ఉప్పల్–ఘట్‌కేసర్ ఓఆర్‌ఆర్–బీబీనగర్ వరకు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్–తుక్కుగూడ ఓఆర్‌ఆర్–మహేశ్వరం క్రాస్‌రోడ్డు– కందుకూరు వరకు, తార్నాక–ఈసీఐఎల్ మార్గంలో మొత్తం 142 కిలోమీటర్ల మేర మెట్రోరైల్ మార్గాన్ని నిర్మించనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

జాతీయ రహదారులను కలుపుతూ..

ఫేజ్–3 పార్ట్–బీలో చేపట్టే కారిడార్లు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ నిర్మించాలని అధికారులు కసరత్తు చేసి ఆ దిశగా ప్రణాళిక రూపొందించారు. ఎన్‌హెచ్–44లోని ఓఆర్‌ఆర్ శంషాబాద్ జంక్షన్–తుక్కుగూడ జంక్షన్–బొంగులూరు జంక్షన్ మీదుగా ఎన్‌హెచ్–65లోని పెద్ద అంబర్‌పేట జంక్షన్ వరకు, ఎన్‌హెచ్ 65లోని ఓఆర్‌ఆర్ పెద్ద అంబర్ జంక్షన్–ఘట్‌కేసర్, శామీర్‌పేట, ఎన్‌హెచ్ 44లోని మేడ్చల్ జంక్షన్ల వరకు, ఓఆర్‌ఆర్ మేడ్చల్ జంక్షన్–దుండిగల్ జంక్షన్–ఎన్‌హెచ్ 65లోని పటాన్‌చెరు వరకు, పటాన్‌చెరు జంక్షన్ నుంచి కోకాపేట జంక్షన్ మీదుగా నార్సింగ్ జంక్షన్ వరకు మొత్తం నాలుగు కారిడార్లలో 136 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ నిర్మాణం జరగనున్నట్లు ఆయన వివరించారు.

ఓఆర్‌ఆర్ చుట్టూ ఏడు ఇంటర్‌చేంజ్ మెట్రోస్టేషన్లు..

ఓఆర్‌ఆర్ చుట్టూ ఏడు ఇంటర్ చేంజ్ మెట్రో స్టేషన్ల నిర్మాణం జరగనున్నాయి. పటాన్‌చెరు, నార్సింగి, శంషాబాద్ జంక్షన్లు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, పెద్ద అంబర్‌పేట జంక్షన్ వద్ద, ఘట్‌కేసర్ మేడ్చల్ జంక్షన్ వద్ద ఇంటర్‌చేంజ్ మెట్రోస్టేషన్లు రానున్నాయి. వీటితో పాటు బయోడైవర్సిటీ పార్కు వద్ద కూడా ఇంటర్‌చేంజ్ జంక్షన్ రానుందని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

- కొత్తగా జిల్లాకు 21మంది రెవెన్యూ అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల్లో దీర్ఘకాలంగా పని చేస్తున్న 19 మంది తహసీల్దార్లకు ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర జిల్లాల నుంచి మరో 21 మంది తహసీల్దార్లను జిల్లాకు కేటాయించారు. వీరికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది.

బదిలీ అయిన వారు..

బదిలీ అయినవారిలో పి.కృష్ణకుమార్, వై.అనితారెడ్డి, కె.అనిత, డి.సంధ్యారాణి, ఎస్.జ్యోతి, ఎండీ నయిమొద్దీన్, ఎస్.పురుషోత్తం, బి.విజయలక్ష్మి, కె.చంద్రశేఖర్‌గౌడ్, ఎం.మహేందర్‌రెడ్డి, అబ్దుల్ మహ్మద్ ఖాన్, మహ్మద్ తాఫిక్ అహ్మద్, కె.రాములు, ఎల్.రామ్మోహన్, వైఎస్.శ్రీనివాస్, యు.అశోక్ కుమార్, ఆర్.వెంకటలక్ష్మి, ఎం.జయశ్రీ, తన్మహి ఉన్నారు. శంషాబాద్, మహేశ్వరం, షాబా ద్, బాలాపూర్ సహా మరో నాలుగు మండలాలకు చెందిన తహసీల్దార్లను కదిలించకపోవడం గమనార్హం.

కొత్తగా వచ్చిన వారు..

డీఎస్ రజని, కె.మాధవిరెడ్డి, ఇ.నవీన్, మహ్మద్ జహీరుద్దీన్, కె.జానకి, పి.వేణుగోపాల్, వీవీఎల్



చంద్రకళ, పాక రమేష్, అన్వర్, ఎం.సురేందర్, ఆర్ గోవర్ధన్, కె.గౌతం కుమార్, శ్రీజగదీశ్వర్, పి.చిన్న అప్పలనాయుడు, వై.అశోక్‌రెడ్డి, కె.శివకుమార్, బి.కృష్ణయ్య, బి.సునీత, సీహెచ్ లలిత, పి.అయ్యప్ప, బి.పార్థసారథిని జిల్లా కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. వీరికి ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది.

ప్రభుత్వాలకు బుద్ధి చెబుదాం

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: సమాజంలోని అవినీతి పరులను అంతం చేయడం గిరిజనులతోనే సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ ఎస్టీసెల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీసెల్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఎన్నికైన రఘును ఘనంగా సన్మానించారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో దళిత, గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి చెందిన ఎంపీనే గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారంటే ఆ పార్టీకి గిరిజనులపై ఉన్న ప్రేమ స్పష్టం అవుతోందన్నారు. బీజేపీ నాయకులు గిరిజనులను ఓటు అడిగే హక్కును కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు జరిగే అన్యాయాలపై కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు పార్టీ నేతలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, అందె మోహన్, ఖదీర్, శ్రీను నాయక్, రాజు, సుక్యా నాయక్, సీతారాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఎన్నికైన రఘును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడిగా మహేందర్



నియామకపత్రం అందజేస్తున్న సాయికుమార్, సతీష్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతీ ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని పీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. మండల పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ పీసీసీ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలోని గాంధీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీసీసీ ఫిషర్‌మెన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్, గౌరీ సతీష్ సంయుక్తంగా ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టపడి పని చేసినప్పుడే పార్టీ గుర్తించి పదవులు ఇస్తుందన్నారు. అనంతరం మహేందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ ఈ పదవి రావడానికి సహకరించిన గౌరి సతీష్, షాబాద్ దర్శన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

తలకొండపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఓ టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్ యాదవ్ తెలిపిన ప్రకారం.. మంగళవారం ఓ టిప్పర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈమేరకు గస్తీకాసి వెంకటాపూర్ గేట్ వద్ద టిప్పర్‌ను పట్టుకుని పీఎస్‌కు తరలించామన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సబ్సి‘డీలా’!

- రాయితీ వ్యవసాయ పరికరాలకు సర్కారు మంగళం
- 2017నుంచి సబ్సిడీల ఎత్తివేత
- ఆందోళనలో రైతులు
- ఈసారైనా యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అభ్యర్థన

మొయినాబాద్ రూరల్: జిల్లాలో మూడు, నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండటంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో రైతులు సేద్యం వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ సమయంలో రాయితీలపై యంత్రాలు, పరికరాలు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఐదేళ్లుగా సబ్సిడీ పథకాలకు స్వస్తి పలకడంతో ఆధునిక సాగుకు దూరమవుతున్నామని చెబుతున్నారు. కనీసం ఈసారైనా సర్కారు చేయూత అందుతుందో.. లేదో అని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఏటా రైతులకు రాయితీ పరికరాలు అందించగా 2017 నుంచి ఆపేశారు.

ప్రైవేటులో అధిక ధర

వ్యవసాయ రంగానికి కావాల్సిన పరికరాల ధరలు ప్రైవేటు దుకాణాల్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. గతంలో రోటోవేటర్ ధర రూ.80 వేలు ఉండగా ప్రస్తుతం రూ.95 వేలకు విక్రయిస్తున్నారు. కల్టివేటర్ ధర రూ.24 వేలు ఉండగా ప్రస్తుతం రూ.35 వేల వరకు, కలుపు తీసే యంత్రాన్ని రూ.38 వేలకు అమ్ముతున్నారు. ట్రాక్టర్‌కు నాగళ్లు గతంలో రూ.30 వేలు కాగా ప్రస్తుతం రూ.40 వేలకు విక్రయిస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్ ధర రూ.18 వేలు ఉండగా.. రూ.23 వేలకు చేరింది. ఇలా ఏ వస్తువు కొనాలన్నా ధరల భారం తడిసి మోపెడవుతోంది.

మ్యాన్యువల్ దరఖాస్తుల్లో అక్రమాలు

సబ్సిడీ యంత్రాల కోసం 2016 నుంచి మీసేవ కేంద్రాల నుంచి మ్యాన్యువల్ దరఖాస్తులు తీసుకుంటున్నారు. కానీ ఇప్పటి వరకు సబ్సిడీ వచ్చింది లేదు. దీంతో చేసేది లేక రైతులు ప్రైవేటు మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా రాయితీపై సాగు యంత్రాలు, సామగ్రి అందజేయాలని కోరుతున్నారు.



ముర్తుజాగూడలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

డబుల్ రేట్లు



వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు గతంలో సబ్సిడీపై పనిముట్లు అందజేసేవారు. ఐదేళ్లుగా ఈ పథకానికి నీళ్లు వదిలేశారు. దీంతో నాగలి కొనాలన్నా, రోటవేటర్ కొనాలన్నా డబుల్ రేట్లు పెట్టాల్సి వస్తోంది.

– గడ్డం వెంకట్‌రెడ్డి, రైతు, సురంగల్

కూలీలపైనే ఆధారం



మారుతున్న కాలానికి అనుగుణంగా కూలీ అవసరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ ప్రభుత్వం నుంచి యంత్రీకరణకు ఎలాంటి చేయూత అందడం లేదు. దీంతో కూలీలపైనే ఆధారపడాల్సి వస్తోంది.

– బందారి చంద్రారెడ్డి, రైతు పెద్దమంగళారం

రాయితీలు అడుగుతున్నారు

ప్రస్తుతం ఎలాంటి సబ్సిడీ యంత్రాలు రావడం లేదు. చాలా మంది రైతులు వ్యవసాయ కార్యాలయానికి వచ్చి రాయితీల గురించి అడుగుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సర్కారు నుంచి ఎలాంటి స్పందన వచ్చినా వెంటనే రైతులకు తెలియజేస్తాం.

– రాగమ్మ, మండల వ్యవసాయ అధికారి

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో గతనెల 28న అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ జి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్‌కుమార్ తన సోదరుడి కుమారుడు బిట్టుకుమార్(12)ని చదివించేందుకు తిమ్మాపూర్‌కు తీసుకొచ్చాడు. ఇష్టంలేని బాలుడు గత నెల 28న ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా తిమ్మాపూర్ స్టేషన్‌లో సికింద్రాబాద్ వైపునకు వెళ్లే రైలు ఎక్కాడు. పక్క సీట్లో ఉన్న ప్లాసీ అనే మహిళ బాలుడి వివరాలు ఆరాతీయగా పొంతలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి ఆమె బాలుడిని తనతో పాటుగా నగరంలోని కాటేదన్‌లో ఉన్న తన నివాసానికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో బాలుడు తనను చేరదీసిన మహిళ ఫోన్ నుంచి ఆగస్టు 31న రాత్రి తన బాబాయి సంతోష్‌కుమార్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు. వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి కాటేదన్ చేరుకుని బాలుడిని అదుపులోకి తీసుకుని ఫిర్యాదుదారుడు సంతోష్‌కుమార్‌కు అప్పగించారు.



బిట్టుకుమార్‌ను బాబాయికి అప్పగిస్తున్న పోలీసులు

‘ఆమనగల్లు లయన్స్’కు అవార్డుల పంట

ఆమనగల్లు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ద్వారా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఈసారి అవార్డుల పంట పండింది. సికింద్రాబాద్‌లోని కేవీఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం అవార్డులు అందజేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డికి విజన్ లీడర్ అవార్డు, బావండ్ల వెంకటేశ్‌కు మల్టీపుల్ రీజియన్ చైర్మన్, ఆమనగల్లు క్లబ్ మాజీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డికి బెస్ట్ మల్టీపుల్ అధ్యక్షుడిగా, పాషకు బెస్ట్ పీఆర్‌ఓగా అవార్డులు దక్కాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ సునీల్‌కుమార్, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ నరేందర్‌రెడ్డి, జూలూరి రఘు, డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొర్వి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ మల్టీపుల్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి నుంచి అవార్డులు అందుకుంటున్న సభ్యులు

ఎయిర్‌పోర్టు ప్రయాణికుల వద్ద బంగారం స్వాధీనం

శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దోహా నుంచి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన కస్టమ్స్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బంగారం పేస్టు ను క్యాప్సుల్స్‌గా మార్చి మలద్వారంలో తీసుకొచ్చినట్లు గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో బయటికి తీయించారు. అతడి వద్ద 701 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ 42.96 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. మరో కేసులో మంగళవారం ఉదయం బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడు సైతం మలద్వారంలో బంగారం పేస్టును తీసుకొచ్చినట్లు గుర్తించి దానిని బయటికి తీయించారు. దాంతో పాటు లగేజీలో సిల్వర్ కోటింగ్‌లో ఉన్న బంగారు గాజును గుర్తించారు. మొత్తం 648 గ్రాముల బంగారం విలువ 39.46 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టైరు పేలి.. కారు బోల్తా

తుర్కయంజాల్: కారు టైర్ పేలి, డివైడర్‌ను ఢీ కొట్టిన సంఘటన తుర్కయంజాల్‌లో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. టీఎస్07హెచ్‌జి 8915 నంబరు కలిగి ఉన్న కారు తుర్కయంజాల్ నుంచి బీఎన్‌రెడ్డి నగర్ వైపునకు వెళ్తుండగా సాగర్ రహదారిపై బుద్ధ విగ్రహం వద్దకు రాగానే ఒక్కసారిగా టైర్ పేలింది. కారు అదుపుతప్పడంతో డివైడర్ పైకెక్కి చెట్లను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ఘటనలో వాహనం ముందు భాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదం జరిగిన చోటికి కొద్ది దూరంలోనే పారిశుద్ధ్య కార్మికులు పనులు నిర్వహిస్తున్నారు. కారు చెట్లను ఢీకొట్టి ఆగిపోవడంతో పెను ప్రమాదమే తప్పింది.

పంచాయతీ కార్యాలయంలో పాము కలకలం

కేశంపేట: గ్రామ పంచాయతీ భవనంలోకి తరుచూ పాములు వస్తుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని సుందరపురం గ్రామ పంచాయతీ భవనం చెరువుకు సమీపంగా ఉండడం, భవనం శిథిలావస్థకు చేరడంతో నిత్యం పాములు సంచరిస్తున్నాయని వారు వాపోతున్నారు. మంగళవారం విధులకు వెళ్లిన సిబ్బంది పామును గుర్తించి బయటకు పంపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, సిబ్బంది కోరుతున్నారు.



పంచాయతీ కార్యాలయంలోకి వచ్చిన పాము

బాలుడి అదృశ్యం

పహాడీషరీఫ్: ఆడుకునేందుకు బయటికి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బీహార్ జిల్లాకు చెందిన మహ్మద్ ఇంతిసాల్(12) పహాడీషరీఫ్ రాజీవ్‌గాంధీనగర్‌లో ఉండే మేన మామ మహ్మద్ అక్బర్ వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. జూలై 31న ఉదయం 10గంటలకు ఆడుకుంటానంటూ బయటికి వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా బాలుడి ఆచూకీ లభ్యమవ్వలేదు. మంగళవారం బాలుడి మేనమామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నెంబర్ లోగాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



ఇంతిసాల్(ఫైల్)

డీసీఎంను ఢీకొట్టిన బైక్

ద్విచక్ర వాహనదారుడి మృతి

పహాడీషరీఫ్: డీసీఎంను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కావిడి మండలానికి చెందిన కేత హరిబాబు(38) సర్దార్‌నగర్‌లో నివాసం ఉంటూ హార్డ్‌వేర్ పార్కులో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 11గంటలకు విధులు ముగించుకొని శ్రీశైలం హైవే మీదుగా తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ ఇండికేటర్ వేయకుండా ర్యాష్‌గా ప్రయాణిస్తుండడంతో గమనించని ద్విచక్రవాహనదారుడు బైక్‌తో డీసీఎంను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో హరిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకు పోలీసులు క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. మృతుడి సోదరి సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపీఎస్ సాధనకు పోరాడుతాం



సభ్యత్వం అందజేస్తున్న మహేందర్ రెడ్డి

పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: పాత పెన్షన్ స్కీం సాధించే వరకు పోరాడుతామని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంఘం మండల శాఖ అధ్యక్షుడు బందయ్య ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా చిన్నమంగళారం, అమ్డాపూర్, తోల్‌కట్ట, హిమాయత్‌నగర్ పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పీఆర్సీ వేసి వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలోగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి కష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్, వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు రేణుక, రాష్ట్ర బాధ్యులు సంజీవన్, లక్ష్మణ్, బీమ్లా, విజయ్‌కుమార్, శ్రీలత, నరేశ్, అనంతరెడ్డి, మెహరున్నీసాబేగం, మంజుల పాల్గొన్నారు.